జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శనివారం | 30 | నవంబర్ | 2024 ◆ పేజీలు : 6

## మహిళలు,పిల్లల సంక్షేమానికే
# శుక్రవారం సభ



**ప్లాస్టిక్ నిషేధాన్ని ఈ సభ ద్వారా ప్రచారం చేయాలి**

**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

*కరీంనగర్ బ్యూరో / చిగురుమామిడి, నవంబర్ 29 (ప్రజాజ్యోతి)*

కరీంనగర్ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న శుక్రవారం సభ మహిళలు, పిల్లల సంక్షేమానికి ఎంతో దోహదపడుతోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల ప్రాంగణంలో నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి అనంతరం శుక్ర వారం సభ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ చేశారు. బాల్య వివాహ్ ముక్త భారత్ పోస్టర్ ఆవిష్కరించారు. గర్భిణీలకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ ప్రతి మహిళా తన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అప్పుడే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.గర్భిణీ, బాలింతల ఆరోగ్యం పట్ల శుక్రవారం సభలో

మిగతా 2 లో...

# రైతు పండుగకు ఆహ్వానం



*కరీంనగర్ బ్యూరో, నవంబర్ 29, (ప్రజాజ్యోతి)*

ఈ నెల 30 వ తేదీన శనివారం రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించను న్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించి శని వారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని

మిగతా 2 లో...

**రైతు వేదికల్లో సీఎం సభ ప్రత్యక్ష ప్రసారం**

**రైతులందరూ తరలిరావాలి**

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



## అంబేద్కర్ భవన నిర్మాణానికి...
# మోక్షం ఎప్పుడో...?

2 లో..

- ఏండ్లు గడుస్తున్న పూర్తికాని నిర్మాణం
- ప్రజల విన్నపాలు... మున్నుపాలేనా..?
- మాటలు చెప్పే నేతలే తప్ప... మూటలు తెచ్చే నాధుడే లేడు
- చెత్తాచెదరంతో అప్రకటిత డంపింగ్ యార్డ్ గా మారిన స్థలం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే నేతలు ఉన్నారే తప్ప... అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించే నాధుడే కరువయ్యాడు. గత పదేళ్లుగా అంబేద్కర్, పూలే భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణం కోసం హుజురాబాద్ ప్రాంత నాయకులు ఇచ్చే వినతులన్నీ మట్టిపాలే అవుతున్నాయే తప్ప నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. నిధులు మంజూరు కాక ఆదిలోనే నిర్మాణానికి బ్రేక్ పడింది. నాటి నుంచి నేటి వరకు అంబేద్కర్, పూలే భవన నిర్మాణానికి ఏ ఒక్క నేత మాట్లాడిన సందర్భం లేదు.

◆ హుజూరాబాద్, ప్రజాజ్యోతి

## ముఖ్యమంత్రి పర్యటన సభా స్థలిని పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



*పెద్దపల్లి / సుల్తానాబాద్, నవంబర్ 29 (ప్రజాజ్యోతి)*

శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష డిసెంబర్ 4న ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం (పెద్దకల్వల సబ్ స్టేషన్ సమీపంలో) వద్ద జరుగుతున్న ఏర్పాట్లను రామ గుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి సభా స్థలి వద్ద వాహనాల పార్కింగ్ చేసేందుకు ఎంపిక చేసిన స్థలం పరిశీలించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుది ట్టంగా భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభలో గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ సభలో రుణమాఫీ జరిగిన రైతులు, పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొనే అవ కాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ తెలి పారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గం గయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజ్ కుమార్, ఈఈ ఆర్ &బీ భావ్ సింగ్, ఈఈ పంచాయతీ రాజ్ గిరీష్ బాబు, సంబంధిత అధికారులు, తదిత రులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు 4 లో..

తెలంగాణలోని రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం 5 లో..

## మహిళలు,పిల్లల సంక్షేమానికి శుక్రవారం సభ



(మొదటి పేజీ తరువాయి...)

చక్కటి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. మహిళా సమస్యల పరిష్కారానికి ఈ సభ వేదికగా నిలుస్తోందని అన్నారు. ప్లాస్టిక్ నియంత్రించాలని నినాదాన్ని కూడా శుక్రవారం సభ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ప్రతి గ్రామంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెడతామని తెలిపారు.జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గ్రామస్థాయిలో అధికారులందరి సమన్వయంతో గత ఆరు నెలలుగా ఈ శుక్రవారం సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభ ద్వారా గర్భిణీలు, బాలింతలు చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారాన్ని సూచిస్తారని తెలిపారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండేలా అంగన్వాడి, ఆరోగ్యశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు సమన్వయంతో తల్లులకు తగు సూచనలు ఇస్తారని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళలకు సుమారు రూ.50 వేలు ఖర్చయే 60 రకాల పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రమాదకరమైన వ్యాధులను ముందే గుర్తించి నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆర్డీవో మహేశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## రైతు పండుగకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి...)

పేర్కొన్నారు. జిల్లాలోని 15 రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులందరూ తమ గ్రామాలకి సమీపంలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తున్న రైతు వేదికలకు పెద్ద ఎత్తున తరలి వచ్చి,సీఎం ప్రసంగాన్ని వీక్షించాలని జిల్లా కలెక్టర్ కోరారు.చొప్పదండి,రామడుగు, గంగాధర, కొత్తపల్లి, గన్నేరువరం, తిమ్మాపూర్, చిగురు మామిడి, మానకొండూరు, హుజురాబాద్ రైతు వేదికల తో పాటు కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి, శంకరపట్నం మండలంలోని కేశవపట్నం,సైదాపూర్ మండలంలోని సైదాపూర్, జమ్మికుంట మండలంలోని తనుగుల, వీణవంక మండలంలోని చల్లూర్, ఇల్లందకుంట మండలంలోని మల్యాల రైతు వేదికల్లో ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రైతులందరూ పాల్గొని ఈ ప్రత్యక్ష ప్రసారం వీక్షించి రైతు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 276 జీవో ను రద్దు చేయాలి

### పాత విధానమే కొనసాగించాలి



**సిరిసిల్ల, నవంబర్ 29 (ప్రజాజ్యోతి)** 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు 276 జీవో తో కొత్త పరీక్షవిధానాన్ని తీసుకురావడం జరిగింది.దానిని అమలు పరచరాదని పాతవిధానాన్ని కొనసాగించాలని టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ ప్రధాన కార్యదర్శి బోయన్న నారాయణలు ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన విధానంలో పేపర్ విధానాన్ని మారుస్తూ తీసుకువచ్చిన విదానం ప్రకారం ఇంటర్నల్ మార్క్స్ 20ని తొలగిస్తూ ప్రభుత్వము జీవో విడుదల చేయడం జరిగింది. వంద మార్కులకు క్వశ్చన్ పేపర్ ఉంటుందని తెలియజేయడం జరిగింది. కానీ 70% విద్య సంవత్సరం పూర్తయిన తరుణంలో ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పదవ తరగతి విద్యార్థులు అయోమయం కు గురి అయ్యే అవకాశం ఉంటుంది కావున ప్రభుత్వము పునరాలోచించి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు పదవ తరగతి విద్యార్థులు ఇప్పటికే పరీక్ష విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారని కొత్త విధానంతో మళ్లీ అవగాహన చేసుకోవడం ఆలస్యమవుతుందని వాళ్ళు అనుకున్న టార్గెట్ రీచ్ కావడం కష్టమవుతుందని తెలిపారు. కావున ప్రభుత్వము పునరాలోచించి ఈ విద్యాసంవత్సరానికి పాత విధానమే కొనసాగించాలని కోరారు.

# అంబేద్కర్ భవన నిర్మాణానికి మోక్షమెప్పుడో...?




**హుజురాబాద్, నవంబర్ 29, ప్రజాజ్యోతి:** గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అంబేద్కర్, పూలే భవన నిర్మాణానికి స్థలం కేటాయించడంతోపాటు నిధులను సైతం మంజూరు చేసిన పనులు మాత్రం మొదలు కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి మంత్రి ఈటల రాజేందర్ చొరవతో పనులు ప్రారంభమైనప్పటికీ నిధులు విడుదల చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి.

**- చెత్తాచెదారంతో అప్రకటిత డంపింగ్ యార్డ్ మారిన వైనం**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిబా పూలే కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం కోసం బస్టాండ్ సమీపంలో స్థలాన్ని కేటాయించారు. కానీ, పనులు ప్రారంభమై మధ్యలోనే నిలిచిపోవడంతో సమీప ప్రాంతాల్లోని వివిధ దుకాణాల యాజమానులు చెత్త చెదారాన్ని అక్కడ పడవేయడం, బస్టాండ్ కు వచ్చే ప్రయాణికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు ఈ స్థలంలో మల మూత్ర విసర్జనలు సైతం చేస్తుండడంతో అప్రకటిత డంపింగ్ యార్డుగా మారి కంపు కొడుతుంది.

**- నాలుగు సార్లు నిధుల కేటాయింపు**

హుజూరాబాద్ పట్టణంలో దళితుల సంక్షేమార్థం కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని దళిత, ప్రజా సంఘాలు చేపట్టిన ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, దీక్షల ఫలితంగా 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బస్టాండ్ సమీపంలోని సర్వే నెంబర్ 2391, 2392, 2393లలో 600 గజాల భూమిని కేటాయించడంతో పాటు రూ.5 లక్షల నిధులను కేటాయించింది. హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈటెల రాజేందర్ సైతం ఈ స్థలాన్ని పరిశీలించి అంబేద్కర్ భవన నిర్మాణానికి ఈ స్థలం బాగు ఉంటుందని, తప్పకుండా అంబేద్కర్ కమ్యూనిటీ హాలు కట్టించేందుకు కృషి చేస్తానని హామీ సైతం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ఆర్థిక, పౌరసరఫరాల మంత్రిగా ఎన్నికైన తర్వాత ఈటెల 2016లో రూ. 9 లక్షలు, 2017లో రూ. 50 లక్షల నిధులు కేటాయించారు. మరోసారి కోటి రూపాయల నిధులను కేటాయించగా పనులు ప్రారంభించినప్పటికీ మధ్యలోనే నిలిచిపోయాయి. నిధులు విడుదలకు కాకపోవడం వల్లే పనులను నిలిపివేశామని కాంట్రాక్టర్ వాదన. ఇప్పటికైనా నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ చొరవ తీసుకొని నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల హుజురాబాద్ పట్టణంలో జరిగిన పౌర సమాజంతో మాటా ముచ్చట కార్యక్రమంలో భాగంగా పలువురు అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం దృష్టికి తీసుకెళ్లగా తాను భవన నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**- అంబేద్కర్, పూలే కమ్యూనిటి హాళ్ళ నిర్మాణానికి మోక్షమెప్పుడూ...?**

అంబేద్కర్, పూలే భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడంతో పాటు నిధులను సైతం కేటాయించారు. ఈ భవన నిర్మాణానికి ఇప్పటికే నాలుగు సార్లు నిధులు మంజూరు చేసిన నేటికి నిర్మాణ దశలోనే ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉపయోగకరంగా ఉండే ఈ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడంతో పాటు నిధులను సైతం మంజూరు చేసిన కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణానికి మోక్షమెప్పుడు కలుగుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**- భవన నిర్మాణానికి మంత్రి చొరవ చూపాలి : ప్రజా సంఘాల నాయకులు**

అంబేద్కర్ భవన నిర్మాణానికి బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి అన్నం ప్రభాకర్ గౌడ్ చొరవ చూపాలని ప్రజల సంఘాల నాయకులు కోరుతున్నారు.. బస్టాండ్ సమీపంలోనే భవన నిర్మాణాన్ని చేపడితే ఎస్సీ, ఎస్టీ, బీసి కులస్థులకు ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. అంబేద్కర్ భవనం స్టడీ సర్కిల్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని భవన నిర్మాణాన్ని ఈ స్థలంలోనే నిర్మించాలని కోరుతున్నారు.

**- స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి**

అంబేద్కర్, పూలే భవన నిర్మాణాలను పూర్తి చేసి అందులో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే హుజరాబాద్ ప్రాంత విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ మండలానికి ఒక స్టడీ సెంటర్ ను ఏర్పాటు చేస్తానని చెప్పిన విధంగా హుజురాబాద్ పట్టణంలో బస్టాండుకు అతి సమీపంలో ఉన్న ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టి అందులో స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు. బస్టాండుకు అతి సమీపంలో ఉండడంవల్ల హుజురాబాద్ మండలంతో పాటు పాత డివిజన్ లోని ఎనిమిది మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

**- నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి**

**– తునికి సమ్మయ్య, ప్రజా సంఘాల నాయకులు**



అంబేద్కర్, పూలే భవన నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. గత 10 ఏళ్లుగా నిధులు విడుదల కాకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఒడితల ప్రణవ్ చొరవచూపి భవన నిర్మాణానికి కృషి చేయాలి.

**- భవన నిర్మాణానికి కృషి చేయాలి**

**– పొడి శెట్టి వెంకట్రాజం, మాజీ ఎంపీపీ సైదాపూర్**

కాంగ్రెస్ ప్రభుత్వం హుజురాబాద్ బస్టాండ్ కు సమీపంలో ఉన్న అంబేద్కర్, పూలే భవన నిర్మాణానికి కృషి చేయాలి. పదేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఒకవేళ భవన నిర్మాణం పూర్తయితే హుజురాబాద్ తో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు చాలా ఉపయోగపరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఈ విషయంపై చొరువచూపి నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలి.



# కరీంనగర్ జిల్లాలో ఆగని బెల్ట్ షాపుల మోత

నాటి పిసిసి ప్రెసిడెంట్,ఎంపి హోదాలో బెల్ట్ ను గ్రామాల్లో నిర్మూలిస్తామన్న ఉక్కు సంకల్పం ఉట్టి మాటేనా..?

ఇప్పటికీ తగ్గని గ్రామాల్లో లిక్కర్ విచ్చలవిడి వ్యాపారం

వైన్స్ షాపు నందు కట్టడి చేస్తేనే పరిష్కారం

సీసీ పుటేజ్ పరిశీలిస్తే బయటపడనున్న వైన్స్,బెల్టుల సిండికేట్ బండారం

చుట్టం చూపుగా మారిన కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ నిఘా...

రహదారుల వెంట

ప్రమాదాలకు వైన్స్ లే ప్రధాన కారణం

వైన్సుల సిండికేట్ ను ప్రోత్సహించడం రేవంత్ సర్కారుకు సరికాదు..

చోద్యం చేస్తూ చూస్తున్న రేవంత్ సర్కార్..

**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 29, (ప్రజాజ్యోతి)**

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్ జిల్లాలో బెల్ట్ షాపుల మోత మోగుతుంది విచ్చలవిడిగా మద్యం వేరులే పారుతున్న జిల్లా లోని ఎక్సైజ్ నిఘా చుట్టపు చూపుగా మారడంతో ఇదే అదునుగా భావించినటువంటి బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం షాపు యజమానులు సిండికేట్ గా మారి జిల్లాలో విచ్చలవిడిగా లిక్కర్ వ్యాపారానికి లేచినప్పటికీ నిర్మూలించవలసినటువంటి అధికారులు ప్రోత్సహించడంలో రేవంత్ సర్కారు హస్తముందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్లపల్లి యుగంధర్ ఎక్సైజ్ శాఖ సూపర్డెంట్ గారికి అనంతరం మాట్లాడుతూ పల్లెల్లో బెల్ట్ షాపుల వల్ల ప్రాణ నష్టం ఆస్తి నష్టం ఆరోగ్య నష్టం ఎక్కువగా జరుగుతుందన్నారు ఉత్తర తెలంగాణ జిల్లాలో కరీంనగర్ జిల్లా లో నిరంతరం బెల్టు నిర్మూలన కోసం అధికారులు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు.నాడు పీసీసీ,ప్రెసిడెంట్ హోదాలో బెల్టు షాపులో నిర్మూలన కోసం విశేషమైన కృషి చేస్తామని నాడు ప్రతిపక్ష హోదాలో ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. జిల్లాలోని ఆయా మండల కేంద్రాలలో ఒకే దగ్గర రెండుమూడేసి వైన్స్ లు సిండికేట్ గా మారి ఒకే వద్ద ఉండటంలో అంతర్యం ఏమిటని రేవంత్ సర్కార్ను ప్రశ్నించారు? ఇదిలా ఉండగా ఇప్పటికే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అక్రమ బెల్టు షాపుల అక్రమ మద్య వ్యాపారం ఆగటం లేదంటే ఎవరిది బాధ్యతని ప్రశ్నించారు. జిల్లాలో మద్యం,బెల్ట్ షాపుల కారణంగా ప్రమాదాలకు గురై ప్రాణా లు వదిలిన సంఘటనలు ఉమ్మడి జిల్లాలో కొకోల్లలుగా ఉన్నాయన్నారు. అయిన జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు,సంబంధిత పోలీస్ శాఖ అధికారులు తమకేమీ సంబంధం లేదన్న విధంగా వివరించడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు విమర్శలకు దారితీస్తున్నమద్యం బెల్ట్ షాపుల నిర్వహణ సిండికేట్ రేవంత్ సర్కార్



హస్తమే ఉందని ఆరోపించారు ప్రస్తుతం ఉమ్మ డి జిల్లాలో కొనసాగుతున్న ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న బెల్ట్ షాపులకు నిర్వాహకుల పైనా నువ్వే లేబుల్ కేసులు నమోదు చేసి ప్రోత్సహిస్తున్న వైన్ షాపుల లైసెన్సును రద్దు చేయాలని ఏవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్లపల్లి యుగంధర్ డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లడ్డు సురేందర్, సన్నీ, వీరేంద్ర, మోహన్,సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా సహకార సంఘాలు

రైతుల కళ్ళల్లో ఆనందం నింపిన ప్రభుత్వం

సింగిల్ విండో చైర్మన్ దేవరనేని మోహన్ రావు

**సుల్తానాబాద్, నవంబర్ 29 (ప్రజా జ్యోతి ):**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కళ్ళల్లో ఆనందాన్ని నింపాడని పలువురు రైతులు పేర్కొన్నారు. శుక్రవారం చిన్నకల్వల సహకార సంఘంలో ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులలో 75% పూర్తి అయ్యిందని తిరిగి రైతులకు రుణాలు అందించడం జరిగిందని సింగిల్ విండో చైర్మన్ దేవరనేని మోహన్ రావు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు రైతు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంఘం పరిది లో ఉన్న (9) గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను . పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు చేతుల మీదిగా ప్రారంభించి ఇప్పటి వరకు రైతులు (705) మంది నుండి 42,353 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ప్రవేశం పెట్టిన క్వింటాలుకు 500 రూపాల బోనస్ ను అందించామన్నారు. సంఘం , రైతుల, కార్య వర్గ సభ్యుల, ప్రక్షాన రైతు పండుగ దినోత్సవం జరుపుకొని ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే , జిల్లా అధికారులకు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సంఘ అధికారులతో పాటు రైతులు పలువురు పాల్గొన్నారు.


## దీక్షా దివాస్ కు భారీగా తరలి వెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు




**హుజురాబాద్, నవంబర్ 29, ప్రజా జ్యోతి :**

బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన అలుగునూర్ లో ఏర్పాటుచేసిన దీక్ష దివాస్ కార్యక్రమానికి హుజురాబాద్ బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో దీక్షా దివాస్ కార్యక్రమం తెలంగాణ ప్రజలు మర్చిపోలేని ముఖ్యమైన ఘట్టమని, ఆనాడు అలుగునూర్ లో జరిగిన ఆ సంఘటనతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అంకురార్పణ జరిగి పునాదులు పడ్డాయని పలువురు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గందే రాధిక, కౌన్సిలర్లు కల్లేపల్లి రమాదేవి, కేసిరెడ్డి లావణ్య, తాళ్ళపల్లి శ్రీనివాస్, కుమారస్వామి, నాయకులు కొలిపాక శ్రీనివాస్, గందే శ్రీనివాస్, కొండ్ర నరేష్, మూరె మధు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన ట్రస్ట్ కు విరాళం అందజేత



**చొప్పదండి ,నవంబర్ 29 (ప్రజా జ్యోతి ):**

చొప్పదండిలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్టు ఏర్పాటు కు చొప్పదండి పట్టణానికి చెందిన గుర్రం విజయలక్ష్మి – చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు రూ.54,116 ఆలయ కమిటీ అధ్యక్షులు బొడిగె వెంకటేష్ గౌడ్ , కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొడిగె వెంకన్న, ఎన్నం మునిందర్, దండె సత్యానందం, పోరండ్ల భాస్కర్, కత్తి రమేష్, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, పిట్టల మల్లేశం , ఆలయ కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తహసీల్దార్, ఎంఈఓ



**సుల్తానాబాద్, నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):**

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి ఎంఈఓ ఆరెపల్లి రాజయ్య శుక్రవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు కలిసి భోజనం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహిస్తున్న మిడ్ డే మిల్స్ పూర్తిగా నాణ్యత తోనే ఉండాలని అందులో వినియోగించే బియ్యం, ఉప్పు, కారం, పప్పు, నూనె, ఇతర ధాన్యాలను పరిశీలించడం జరిగిందని అన్నారు. అలాగే వారానికి రెండు సార్లు కోడి గుడ్లు, విద్యార్థులకు అందించాలని మిడ్ డే మిల్స్ నిర్వాహకులకు సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు మిడ్ డే మీల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి శ్రీమథ్ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు ఎంపికైన ఐపీఎస్ విద్యార్థులు



**సుల్తానాబాద్, నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):**

పెద్దపల్లి జిల్లాస్థాయి శ్రీమథ్ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు ఆరుగురు ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రం ఎస్వీఆర్ గార్డెన్ లో గీతా జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీమథ్ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు స్మితిక శ్రీ మూడవ తరగతి, సంజన శ్రీ ఐదవ తరగతి, టి సాయి చరణ్ ఆరవ తరగతి, ఈ. శ్రీ నిత్య ఆరో తరగతి, ఈ. అక్షయ ఎనిమిదో తరగతి, టి. సాహిత్య తొమ్మిదవ తరగతి విద్యార్థులు మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేసినట్లయితే అందులోని సారాంశం జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని, సంస్కృతి,ఇతిహాస విలువలను విద్యార్థులలో పెంపొందించడానికి భగవద్గీత కంఠస్థ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఆర్టీసీ కార్మికులు

**హుజురాబాద్, నవంబర్ 29, ప్రజాజ్యోతి :**



ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి అప్పాల రాములు గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు ఆయన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పరామర్శించిన వారిలో రిటైర్డ్ ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు ఆర్ బండారి, మార్త రవీందర్, ఇవి ఆర్ నరసయ్య, ముషం వెంకటేశ్వర్లు, వేల్పుల ప్రభాకర్, అప్పలనారాయణ తదితరులు ఉన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి**

**గ్రానైట్ క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి**

**ప్రతి క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలి**

**కలెక్టర్ పమేలా సత్పతి**



*కరీంనగర్ బ్యూరో, నవంబర్ 29, (ప్రజాజ్యోతి)*

జిల్లాలో ఖనిజ అభివృద్ధి సంస్థ పరిధి లోకి వచ్చే కంకర, గ్రానైట్ తదితర క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిసూచించారు. ఈమేరకుఅధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని,నిబంధనలు అతిక్రమించకుండా చూడాలని ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నీటి పారుదలశాఖ,భూగర్భ గనులశాఖ, రెవెన్యూ శాఖ, తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాకలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడారు. గ్రానైట్ క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, ఏలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కంకర గ్రానైట్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలనిసూచించారు. జిల్లాలోని ప్రతి క్వారీ ప్రవేశ ద్వారం, బయటకు వెళ్లే ద్వారంతో పాటు పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలన్నారు. 15రోజుల్లో ఈ ప్రక్రియపూర్తి చేయాలనిఆదేశించారు. వీటి మానిటరింగ్ ను నిర్వాహకులకు కాకుండా అధికారులు చూసుకోవాలని సూచించారు. డిఫాల్ట్ అయిన 67 క్వారీల్లో పనులు జరగడానికి వీల్లేదన్నారు. ఆ క్వారీలకు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని ఆదేశించారు. వే బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తే సీజ్ చేయాలన్నారు. దీనిపై అటవీ, రవాణా, పోలీస్, రెవెన్యూ, ఖనిజశాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అన్ని రకాలుగా క్వారీలను తనిఖీ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్,మైనింగ్ ఏడి రామాచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలి

**– బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు**



*హుజురాబాద్, నవంబర్ 29, ప్రజా జ్యోతి :*

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలిసే విధంగా బిజెపి కార్యకర్తలు పాటుపడాలని బిజెపి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు కోరారు. శుక్రవారం బిజెపి ముఖ్య కార్యకర్త సమావేశం బిజెపి హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి అధ్యక్షతన హుజురాబాద్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను తీవ్రంగా మోసం చేయడం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయడం కోసం డిసెంబర్ 2,3 తేదీలలో హుజురాబాద్ నియోజకవర్గంవ్యాప్తంగా బైక్ ర్యాలీ చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 5వ తేదీ రోజున హుజురాబాద్ పట్టణంలో బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను ప్రజలకు తెలియజేయనున్నట్టు ఆయన తెలిపారు. బైక్ ర్యాలీ, బహిరంగ సభలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబెర్ పుప్పాల రఘు, అసెంబ్లీ కన్వీనర్ గౌతమ్ రెడ్డి, మండల అధ్యక్షులు గంగిశెట్టిరాజు, ఆదిరెడ్డి, జీడీ మల్లేష్, తిరుపతి రెడ్డి, జిల్లా మోర్చా జనరల్ సెక్రటరీ ఆకుల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మల శోభన్ పాల్గొన్నారు.

## శానిటరీ ప్యాడ్ డిస్పోజబుల్ యంత్రం అందజేత



*కరీంనగర్ రూరల్, నవంబర్ 29, ప్రజాజ్యోతి*

కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలకు శుక్రవారం శానిటరీ ప్యాడ్ డిస్పోజబుల్ యంత్రాన్ని (ఇన్సురేటర్) ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్, ప్రతిమ గ్రూప్స్ డైరెక్టర్ డా. బోయినపల్లి హారిణి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆడపిల్లల ఆరోగ్యం పట్ల అవగాహన శానిటరీ నాప్కిన్స్ సెప్టి డిస్పోజల్ విధానం గురించి అవగాహన కల్పించారు. ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్, ప్రతిమ గ్రూప్స్ డైరెక్టర్ డా. బోయినపల్లి హారిణి మాట్లాడుతూ పీరియడ్స్ అనేది దాచి పెట్టే విషయం కాదు ఇది అందరితో మాట్లాడాలి అన్నారు, ఆడపిల్లలు చదివితే నే కుటుంబం గ్రామాలు దేశం అభివృద్ధి చెందుతుంది అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్, డాక్టర్ మనస్విని కె గైనకాలజిస్ట్ ప్రతిమ హాస్పిటల్ , యునిసెఫ్ పిల్ల కోఆర్డినేటర్ కిషన్ స్వామి, పాఠశాల సిబ్బంది, 500 మంది విద్యార్థులు, ప్రతిమ ఫౌండేషన్ బృందం పాల్గొన్నారు.

## ఎంఈఓ ప్రాథమిక పాఠశాల సందర్శన



*చొప్పదండి, నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):*

చొప్పదండి మండలం ఆర్నకొండ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితుల శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కచ్చితంగా ఎండిఎం మెనూ పాటించాలని, వారానికి మూడుసార్లు గుడ్డు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. వంట శుభ్రంగా రుచికరంగా ఉండాలని సూచించారు.

## ఓసిపి5 ఎదుట ఐఎన్టీయూసీ ధర్నా



*గోదావరిఖని, నవంబర్ 29 (ప్రజాజ్యోతి )*

సింగరేణి ఆర్ జీవన్ ఓసిపి ఫైవ్ లో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఐ ఎన్ టి యు సి డిమాండ్ చేసింది. శుక్రవారం ఓసీపీ ఎదుట యూనియన్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఓసీపీ – 5 లో నూతన యంత్రాలను కొనుగోలు చేసి ఉత్పత్తిని చేపట్టాలని, ఓవర్ మెన్లకు చార్జ్ అలవెన్స్ ను వెంటనే తిరిగి పునరుద్ధరించాలని, డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ పనులను కంపెనీ ఉద్యోగులతో చేపించాలని, నూతనంగా నిర్మించిన వాషింగ్ ప్లాంట్ ను వినియోగంలోకి తీసుకురావాలని, కార్మికులపై యాజమాన్యం వేధింపు చర్యలను మానుకోవాలని, బేస్ వర్క్ షాప్ లో షెల్టర్లు, తాగునీరు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓసీపీ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. పిట్ సెక్రటరీ ఎల్. ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణ, గంద్ర దామోదర్ రావు, బత్తుల పోచయ్య, దేవులపల్లి రాజేందర్, విజయ్ మోహన్, పోతరవేన సమ్మయ్య, మందర మేష్, పుట్ట రమేష్, కోర శ్రీనివాస్, కందికట్ల సమ్మయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, రామ్ చందర్, ఎం. సుధాకర్ రెడ్డి, గుండేటి శ్రీనివాస్, ఎదులాపురం శ్రీనివాస్, తాటికొండ అంజయ్య, కూషనపల్లి శంకర్, నాగరాజు, ఆర్ డి చారి, ఏ.కృష్ణ , పైడిపల్లి అశోక్, తాళ్ల కుమార్, ఎల్ అశోక్, రామకృష్ణ, మామిడి రవి, పి. సంపత్, వెంకటేష్, అనిశెట్టి శ్రీనివాస్, చంద్రమోహన్, దాసరి నర్సయ్య, వివిధ గనుల పిట్ సెక్రటరీలు సిరిపురం నరసయ్య, రాజేశం, గణపతి దామోదర్, బద్రి శంకర్, రాకేష్, దశరథం, లింగయ్య, మురళి పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో నిరుపేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



*కోనరావు పేట నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):*

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 లక్షల ముప్పై వేల విలువగల సీఎం సహాయనిది చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని అందులో భాగంగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుండి పది లక్షల వరకు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అత్యవసర పరిస్థితులలో చికిత్స తీసుకునే వారికి ఎల్ ఓ సి లను అందించి ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చ కాయల ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా కిసాన్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్ర రవీందర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హుజరాబాద్ లో చోరీ

**– లక్ష రూపాయలు విలువచేసే సరుకుల దొంగతనం**





*హుజురాబాద్, నవంబర్ 29, ప్రజా జ్యోతి :*

హుజురాబాద్ పట్టణంలోని సిర్సపల్లి రోడ్డు లో గల కొమురవెల్లి మార్కండేయ కు చెందిన శ్రీ రాజరాజేశ్వర కిరాణం లో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి ఎప్పటిలాగే షాప్ మూసివేసి పడుకున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం షాప్ తెతెలిసేందుకు వెళ్లగా షట్టర్ తీసి ఉండడాన్ని గమనించిన షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. షాప్ సెట్టర్ ను ఇనుప వస్తువుతో తెరిచి షాప్ లోని సరుకులను దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు లక్ష రూపాయల విలువచేసే సరుకులతో పాటు కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

# తెలంగాణలోని రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

**ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి తొలి ఏడాదిలోనే 55 వేల కోట్లు ఖర్చు...**

**నేటి నుండి రైతులకు అవగాహన కల్పించేలా మూడు రోజులు విజయోత్సవ వేడుకలు..**

**ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్...**



*కోనరావు పేట, నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):*

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని రైతు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి తొలి ఏడాదిలోనే 55,వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని అన్నారు. నేటి నుండి రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు రైతు పండుగను నిర్వహిస్తుందనీ, ఈ వేడుకకు వివిధ జిల్లాలోని రైతులందరూ హాజరయ్యేలా వ్యవసాయ శాఖతో పాటు వివిధ అనుబంధ శాఖలన్ని భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోనే వరి సాగు విస్తీర్ణంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుందని 66.77 ఎకరాల వరి సాగు చేయగా 53 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని అన్నారు. అన్నిమండలాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండేలా 148 మంది అధికారులను నియమించారని, ఉద్యానవన శాఖలో 18 మంది హార్టికల్చర్ అధికారులను ప్రభుత్వం నియమించింది అని అన్నారు. ఆయిల్ ఫామ్ రైతులకు టన్నుకు 2000 రూపాయల అదనపు లబ్ధి చేకూరేలా సుంకం సంబంధించిన సమస్యలు పరిష్కరించామని తెలిపారు. రైతులకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ప్రకటించడంతో సన్న రకాల వరిసాగు విస్తీర్ణం రాష్ట్రంలో పెరిగిందని ఆన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, జిల్లా కిసాన్ శాల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోర్ర రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు డీలర్లు సరైన సూచనలు ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




*కరీంనగర్ బ్యూరో, నవంబర్ 29, ప్రజాజ్యోతి,*

విత్తనాలు, ఎరువుల కోసం వచ్చిన రైతుకు ఇన్ పుట్ డీలర్లు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కృషిభవనంలో ఇన్ పుట్ డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై డిప్లమా కోర్సు శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. 40 మంది డీలర్లకు సంవత్సరం పాటు వారానికి ఒకరోజు ఈ శిక్షణ ఇవ్వనున్నారు.క్షేత్రస్థాయిలో డీలర్లను వివిధ పరిశోధన కేంద్రాలకు,వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్లన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా డీలర్లని నమ్ముతారని, అందువల్ల రైతుల ద్వారా డీలర్లకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకుగాను ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ శిక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి తెలియజేస్తామన్నారు. వారు రైతులకు సూచిస్తారని తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతు ఎంత ముఖ్యమో డీలర్లు అంతే ప్రధానమని అన్నారు.డీలర్లను రైతులు నమ్ముతారని,వారి సలహాలను రైతులు తప్పనిసరిగా పాటిస్తారని తెలిపారు. సొంత లాభం కోసం కొంతమంది డీలర్లు రైతులను మోసగిస్తూ నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్నారని అన్నారు.దీనివల్ల రైతు కుటుంబం 6 నెలల శ్రమ వృధా అవుతుందని ఆవేదన చెందారు.విడిగా విత్తనాల విక్రయం, గడువు తేదీ ముగిసిన ఎరువులు, విత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. రైతుకు లాభం చేకూర్చే సూచనలు ఇస్తూ నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు.రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాగ్యలక్ష్మి, ఆత్మాపీడీ చత్రు నాయక్, డిహెచ్ఓ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు మధుకర్, మహేష్, రైతు శిక్షణా కేంద్రం అధికారి మమత, స్రవంతి పాల్గొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయండి

**ఎమ్మెల్యే విజయ రమణారావు**



*సుల్తానాబాద్, నవంబర్ 29 (ప్రజాజ్యోతి )*

డిసెంబర్ 4న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని పెద్దకల్వల లో ఏర్పాటుచేసిన సభను విజయవంతం చేయాలని నియోజకవర్గంలోని మండలాల నాయకులకు కార్యకర్తలకు దిశ నిర్దేశించిన ఎమ్మెల్యే విజయ రమణారావు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినపల ప్రకాష్‌రావు వరప్రసాద్ బిరుదు కృష్ణ అబ్బాయి గౌడ్ సాయిరి మహేందర్ దామోదర్ రావు చిలక సతీష్ ప్రేమ్చందర్రావు చింతల రాజు దున్నపోతుల రాజయ్య తోపాటు నాయకులు కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## డిసెంబర్ 4న పెద్దపల్లికి ముఖ్యమంత్రి రాక

**అక్కడి నుంచే రామగుండం అభివృద్ధి పనులు ప్రారంభం**

**సభను జయప్రదం చేయాలి : రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



*గోదావరిఖని, నవంబర్ 29, (ప్రజాజ్యోతి )*

పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో డిసెంబర్ 4న జరుగనున్న నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్నట్లు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తెలిపారు.శుక్రవారం స్థానిక గాంధీ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సభ ను విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం,డివిజన్ నుండి భారీ సంఖ్యలో ప్రజలను తరలించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు.రామగుండం నియోజకవర్గంలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి సభా వేదిక నుంచే వర్చువల్ గా ప్రారంభిస్తారని,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నమోదుకు డిసెంబర్ 9 వరకు గడువు పొడిగించారని,కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున నమోదు చేయించాలని ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్,కార్పొరేటర్లు,సీనియర్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు,వివిధ విభాగాలు, వివిధ డివిజన్ల అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**సభ స్థలిని పరిశీలిస్తున్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



*కరీంనగర్ బ్యూరో, నవంబర్ 29, (ప్రజాజ్యోతి )*

కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలనీ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ ఆర్ ఆర్ మైదానం సభ స్థలిలో భూమి పూజ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఊపాధ్యాయులు, ఎల్ఐసి ఉద్యోగులు,డాక్టర్లు వివిధ రంగాల ప్రముఖులు, భారీ ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఆయన వెంట వి.రవీందర్ రెడ్డి, ఎర్రం శెట్టి మునిందర్ ,మహిపాల్ రెడ్డి,యూత్ లీడర్ కోమటిరెడ్డి అశోక్ రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

**మర్రిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



*కోనరావు పేట నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):*

విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు పేట మండలంలోని మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రభుత్వ విప్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు మెనూలో భాగంగా ఏ ఆహార పదార్థాలు విద్యార్థులకు వండి పెడుతున్నారో అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడతు విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని,వారు చదువుతో పాటు ఆటల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆటలు దేహదారుడ్యానికి, మనోవికాసానికి దోహదం చేస్తాయని వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించి ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు.అనంతరం మరిమడ్ల గ్రామంలో గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన గజ్జెల అజయ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

## రైతుల కళ్ళల్లో ఆనందం నింపిన ప్రభుత్వం

*సుల్తానాబాద్ నవంబర్ 29(ప్రజా జ్యోతి ) :*

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కళ్ళల్లో ఆనందాన్ని నింపాడని పలువురు రైతులు పేర్కొన్నారు. గర్రెపల్లి సింగిల్ విండో కార్యాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు చేతుల మీదిగా ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ప్రవేశం పెట్టిన క్వింటాలుకు 500 రూపాల బోనస్ ను అందించామన్నారు. సంఘం ,రైతుల,కార్యవర్గసభ్యుల ,ప్రక్షాన రైతు పండుగ దినోత్సవం జరుపుకొని ముఖ్యమంత్రి,ఎమ్మెల్యే ,జిల్లా అధికారులకు, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో మహమ్మద్ నబియోధిన్ డైరెక్టర్లు సంఘ అధికారులతో పాటు రైతులు పలువురు పాల్గొన్నారు.



# నూతన అంగన్వాడీ కేంద్ర భవనానికి భూమి పూజ

**–మండలంలో పర్యటించిన జువ్వాడి**

మల్లాపూర్, నవంబర్ 29, ప్రజాజ్యోతి



మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగారావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని గుండంపల్లి గ్రామంలో నూతన అంగన్వాడీ కేంద్ర భవనానికి రూ. 12 లక్షల రూపాయలు మంజూరు అవ్వగా నూతన భవనానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం చిట్టాపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని వ్యక్తులను పరామర్శించారు.అలాగే వడ్డెర కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సాతారం గ్రామంలోని ఇటీవల వ్యక్తి మృతి చెందగ బాధిత కుటుంబానికి ఐదు లక్షల మంజూరు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అలాగే గొర్రెపల్లి గ్రామ పెద్ద చెరువును అధికారులతో సందర్శించి నిధులు మంజూరు చేయించి త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని, వడ్ల కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు లేవని, రైస్ మిల్లులలో, కోతలు లేకుండా కొనుగోలు జరుగుతున్నాయని,గత ప్రభుత్వంలో రైతన్న పండించిన పంట అమ్ముకోవడానికి నానా కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కిషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి, మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనితడుపుల పుష్పలత–నర్సయ్య, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మండల అధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మరిపెల్లి సత్తమ్మ–మల్లయ్య, కోటగిరి ఆనంద్ గౌడ్, నల్ల బాపురెడ్డి, మిట్టపల్లి జీవన్ రెడ్డి, గోపిడి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్జీ1 లో క్వార్టర్ కౌన్సిలింగ్



గోదావరిఖని, నవంబర్ 29 (ప్రజాజ్యోతి)

సింగరేణి ఆర్జీ వన్ లో క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహించారు.రామగుండం ఏరియా–1 లో విధులు నిర్వహిస్తున్న అన్ని గనులు,డిపార్ట్ మెంట్లు,వివిధ క్యాటగిరిలలో పని చేస్తున్న(ఎన్.సి.డబ్ల్యూ.ఏ) క్యాటగిరి–1 నుంచి క్యాటగిరి–6వరకు గల ఉద్యోగులకు శుక్రవారం స్థానిక ఆర్.సి.ఓ.ఏ క్లబ్ లో క్వార్టర్ అలాట్ మెంట్ కమిటి ఆద్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ క్వార్టర్ కౌన్సిలింగ్ లో శారదానగర్,విటల్ నగర్,తిలక్ నగర్,బస్టాండ్ కాలనీలలోని డి,టి–2,ఎంబి, ఎస్టీ–2 టైప్ క్వార్టర్ లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.352 క్వార్టర్లకు గాను 70మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 17 మంది మాత్రమే అర్హత క్యాటగిరిని,పదవిని ఆధారంగా క్వార్టర్ లను కేటాయించినట్లు,క్వార్టర్ కౌన్సిలింగ్ ను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో యస్ఓటు జిఎం గోపాల్ సింగ్,డిజియం పర్సనల్ కిరణ్ బాబు,ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం,సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్, హనుమంత రావు, సంక్షేమాదికారులు ఇక్బాల్ షరీఫ్, రవీందర్, ఫిరోజ్ ఖాన్, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది శ్రీనివాస్, అన్వేష్ పాల్గొన్నారు.

## విజ్ఞాన ప్రదర్శనను విజయవంతం చేయాలి

**జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రావు**

కరీంనగర్ రూరల్, నవంబర్ 29,ప్రజాజ్యోతి,

కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూలులో నేటి నుండి జరుగబోయే విజ్ఞాన ప్రదర్శనను విజయవంతం చేయాలని జిల్లా జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రావు కోరారు. కౌంటర్ ఇన్చార్జ్ లు వివిధ నిర్వాహణ కమిటీలతో శుక్రవారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేన్ చేసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థులు శనివారం ఉ.9 గంటలకు నిర్దేశించిన కౌంటర్ లో రిపోర్టు చేయాలని అన్నారు. మధ్యాహ్నం విద్యార్థులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రి పూట పిల్లలు బస చేసే పిల్లలతో ఉపాధ్యాయులు వుండాల్సి వస్తుందన్నారు. శనివారం విజ్ఞాన పుదర్శన ఉ.10.గంటలకు ప్రారంభిస్తామన్నారు, ఇన్సిపైర్ అవార్డుల పుదర్శనలో పాల్గొంనేవారు సైతం ఉదయం రావలని అన్నారు. ఈ కార్యక్రమానికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వివిధ కౌంటర్ బాద్యులు, జిల్లా సైన్స్ అధికారి చాట జయపాల్ రెడ్డి, డి.సి.ఇ.బి. కారదర్శి మారం స్వదేశ్ కుమార్, మండల విద్యాధికారులు ఎం.డి. అజీం ఎం. మధుసూధనాచారి, ఎం. భగరంతయ్య, సెక్టోరల్ అధికారి ఎం.శ్రీనివాస్ వి. ఆంజనేయులు, కె. ఎస్. అనంతాచార్య తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో గడ్డి మందు తాగి యువకుడు మృతి





కోనరావు పేట నవంబర్ 29 (ప్రజాజ్యోతి ):

చేసిన అప్పులు తీర్చే మార్గం లేక దూస వెంకటేష్ 34 అనే యువకుడు గడ్డి మందు సేవించి గత వారం రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో చోటుచేసుకుంది.మృతుడు వెంకటేష్ గత ఆరు నెలల క్రితం గల్ఫ్ దేశం వెళ్లి అక్కడ ఉపాధి సరిగా లేకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. వేములవాడలోని ఓ బట్టల దుకాణంలో జీతం ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే క్రమంలో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక గత వారం రోజుల గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వారి స్తోమతకు మించి చికిత్స చేయించిన వెంకటేష్ మరణించాడు. దీనితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కాగా మృతునికి తల్లి తండ్రి, భార్య సంధ్య కూతుర్లు నిత్యాశ్రీ 3 యేండ్లు,నాయణశ్రీ 18 నెలలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకొని న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రజకులు అన్ని రంగాల్లో రాణించాలి..

**నవాబు పేటలో రజక సంఘం కమిటీ హాల్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



చిగురుమామిడి నవంబర్ 29 (ప్రజాజ్యోతి )

రజకులు అన్ని రంగాల్లో రాణించాలని,రజకులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబు పేట గ్రామంలో రజక కమ్యూనిటీ హాల్ భవనమును జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రజక సంఘం నాయకులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి వారు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘము రాష్ట్ర అధ్యక్షులు బస్వారాజు శంకర్,ఉపాధ్యక్షులు గంపల శ్రీనివాస్,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,గ్రామశాఖ అధ్యక్షులు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,రజకసంఘము అధ్యక్షులు వరుకొలు సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు వరుకొలు తిరుపతి,గౌరవ అధ్యక్షులు పున్నం నర్సయ్య,సంఘము సభ్యులు వరుకొలు సారయ్య, కనుకయ్య, ఐలయ్య, వరుకొలు బాలయ్య, పోచయ్య, కొమురయ్య, పున్నం ఆశయ్య, వరుకొలు కనుకయ్య, వెంకటేష్ రవీందర్, చంద్రయ్య పాల్గొన్నారు.

## కొత్తపల్లి పోలీస్ స్టేషన్ సీపీ ఆకస్మిక తనిఖీ



కరీంనగర్ క్రైం, నవంబర్ 29, ప్రజాజ్యోతి

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ను శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ లో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు.విసిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు.సైబర్ నేరాల బారిన పడకుండా పరిధి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు.గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం, పేకాట వంటి వాటి పై ఉక్కుపాదం మోపాలన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై సాంబమూర్తి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విలేకరులను అరెస్టు చేసిన పోలీసులు

**అక్రమ వసూళ్ల కు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తప్పవు.. సీఐ నిరంజన్ రెడ్డి**

మెట్ పల్లి, నవంబర్ 29, ప్రజాజ్యోతి:




నకిలీ విలేకరులను ఇద్దరిని అరెస్టు చేసినట్టు మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి, చౌడారపు వెంకటరమణ సాతారం గ్రామానికి చెందిన వ్యక్తి తన యొక్క కిరాణం సామానుల అవసరం కోరకు అతని కారులో మెట్ పల్లి వచ్చి వెళ్తున్న నిమిత్తం ఇద్దరు ఆగంతకులు వెంకటరమణ కారును ఆపి నీవు కారులో డూప్లికేట్ సామాన్లు తీసుకు వస్తున్నావని వాటిని చిందర వందరగా చేసి శేఖర్, కార్తీక్ అనే యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్స్ బెదిరింపులకు పాల్పడినారు, వెంకటరమణ దగ్గర నుండి డబ్బులు డిమాండ్ చేసినారు ఈ అమౌంట్ ను ఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసినారు. ఇట్టి విషయం ఎవరికీ చెప్పకు అని బెదిరింపులు చేసినారు. బాధితుడు వెంకటరమణ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో విచారించగా మెట్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినారు, వెంటనే అప్రమత్తమమైన పోలీసులు నిందితులను మెట్ పల్లి శివారంలో ఓ పెట్రోల్ బంక్ వద్ద గుర్తించినారు, శేఖర్, రామగిరి కార్తీక్ కార్ మరియు బైక్ రెండు సెల్ ఫోన్లను స్వాధీనపరచుకొని నిందితులను ఇద్దరిని మెట్ పల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి వారిపై తదుపరి చర్య నిమిత్తం రిమాండ్ కు ఇట్టి సమావేశంలో ఏఎస్ఐ సత్తయ్య మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.